నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 13 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మిషన్ భగీరథ ద్వారా నిరంతరం నీటి సరఫరా

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 12 : జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం మిషన్ భగీరథ ద్వారా నిరంతరం నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ తెలిపారు. ఈ క్రమంలో దినపత్రికల్లో వచ్చిన వార్తా కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కరించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జైనూర్ మండలం జంగాం గ్రామంలో 614 ఆవాసాలు, 2,398 జనాభా ఉందని, గ్రామపంచాయతీ పరిధిలోని సడక్ గూడలో 113 ఆవాసాలు, 576 జనాభా ఉందని వివరించారు. గ్రామపంచాయతీలో నీటి అవసరాలు తీర్చేందుకు చేతిపంపులు, బోరు బావులు, బావులు, మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా, ఆర్వో ప్లాంట్ ఉన్నాయని తెలిపారు. తాగునీటి సరఫరాలో సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంతో ఇంటింటికీ తిరిగి గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దీపక్ తివారీ పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు సూచనల మేరకు జైళ్ల ఉన్నతీకరణ

మాట్లాడుతున్న జడ్జి ఎం రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 12 : సుప్రీం కోర్టు సూచనల మేరకు రాబోయే 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని జైళ్లను ఉన్నతీకరించనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వీ. రమేశ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో కమిటీ సభ్యులతో రెండో రోజూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న జైళ్లను విస్తరించడం, ఉన్నతీకరించడం జరుగుతుందని, వాటిలో సౌకర్యాల కల్పనకు నివేదిక రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే అనంతలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ప్రత్యేక ఉపకారాగారం సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

పాతాళానికి గంగమ్మ

ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం

- డెడ్ స్టోరేజీకి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు
- శరవేగంగా పడిపోయిన భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే భారీ వ్యత్యాసం
- సాగు, తాగు నీటికి తండ్లాడుతన్న ప్రజానీకం
- ఎండల తీవ్రత పెరిగితే సమస్య మరింత జటిలం

మంచిర్యాల, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందగా, భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగు నీటికి తండ్లాడాల్సి వస్తున్నది. కాళేశ్వరం కిందున్న ప్రాజెక్టులు నింపకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. ప్రాజెక్టుల నుంచి నీరు రాక.. కాల్వలు, చెక్ డ్యామ్‌లు నిండక బోర్ల వినియోగం విపరీతంగా పెరిగి గంగమ్మ తల్లి పాతాళానికి చేరుకున్నది. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో భూగర్భ జలాల నీటిమట్టం భారీగా పడిపోయింది. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో దాదాపు 1.25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మంచిర్యాలలో 0.96, ఆసిఫాబాద్‌లో 0.56, ఆదిలాబాద్‌లో 0.19 మీటర్ల లోపలికి వెళ్లిపోయాయి.

ఆదిలాబాద్ రూరల్ మండలం దార్‌లొద్ది గ్రామంలో బోర్ నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

జైనూర్ : మాన్కాపూర్‌లో బావిలో అడుగంటిన నీరు

ప్రాజెక్టుల్లో నీరు లేకే ఈ దుస్థితి..

భూగర్భ జలాలు పడిపోవడానికి ప్రధాన కారణం ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టు, మంచిర్యాల జిల్లాను ఆనుకొని ఉన్న ఎల్లంపల్లి, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీళ్లు ఉన్నాయి. దీంతో గతేడాది ఉమ్మడి జిల్లాలో గోదావరి నది నిండుకుండలా ప్రవహించింది. మండువేసవిలోనూ నీటితో కళకళలాడింది. ఫలితంగా ఈ జిల్లాలో భూగర్భ జలాలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. అటు కడెం, ఇటు ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. కడెం కిందున్న ఆయకట్టుకు ఇప్పటికే క్రాప్ హాలిడే ప్రకటించగా, ఎల్లంపల్లిలో డెడ్‌స్టోరేజీలో ఉన్న నీటిని హైదరాబాద్ మెట్రో వాటర్ స్లపయ్‌కి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఒకవేళ అంచనాలు తప్పి ఈ ప్రాజెక్టులు అడుగంటితే బోర్లమీద ఆధారపడి తాగునీరు సరఫరా చేయాల్సి వస్తుంది. గతేడాది ప్రాజెక్టుల్లో పుష్కలమైన నీరు ఉండడంతో బోర్లలో భూగర్భ జలాలు ఉబికివచ్చాయి. కానీ ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీరులేక భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతూవస్తున్నాయి.

మండలాల్లో పాతాళానికి..

జిల్లా మొత్తానికి సగటున చూసినప్పుడు భూగర్భ జలాలు పడిపోయిన శాతం తక్కువగా ఉన్నా.. చాలా మండలాల్లో ఆందోళనకరమైన దుస్థితికి జలమట్టం పడిపోయింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో గతేడాది ఈ సమయానికి 25.10మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది 32.00మీటర్లలోతుకు అవి పడిపోయాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ ప్రాంతంలో 7.60మీటర్ల నుంచి 9.55మీటర్లకు పడిపోయాయి. నిర్మల్ జిల్లాలో మామడ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో గతేడాది 18.64 మీటర్లలోతులో ఉన్న జలాలు 36.62మీటర్లకు పడిపోయాయి. లోకేశ్వరంలో 10.53 మీటర్ల నుంచి 16.15 మీటర్ల లోపలికి వెళ్లిపోయాయి. తానూర్, పెంబి, ముథోల్ సహా మిగిలిన మండలాల్లో రెండు మీటర్ల నుంచి ఐదు మీటర్ల వరకు భూగర్భ జలమట్టం పడిపోయింది. మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రాంతం లో 3.31 మీటర్ల నుంచి 9.80 మీటర్లకు, జన్నారంలో 2.67నుంచి 4.60, జైపూర్‌లో 16.29మీటర్ల నుంచి 21.10మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. ఇక ఆసిఫాబాద్ జిల్లాలో రెబ్బెన మండలంలోని కొన్ని ప్రాంతాల్లో 6.70మీటర్ల నుంచి 9.72 మీటర్లకు, కాగజ్‌నగర్‌లో 14 మీటర్ల నుంచి 16.20మీటర్లకు భూగర్భ జలమట్టం తగ్గింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఎండల తీవ్రత పెరిగితే మరింత సమస్య జటిలమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

గతేడాది, ఈ ఏడాది మార్చి నెలల్లో భూగర్భ జలాలు(సగటున)

జిల్లా	మార్చి-2023	మార్చి-2024	పడిపోయిన నీటిమట్టం
నిర్మల్	8.94	10.19	-1.25
మంచిర్యాల	6.08	7.04	-0.96
ఆసిఫాబాద్	7.82	8.38	-0.56
ఆదిలాబాద్	8.92	9.11	-0.19

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

అధికారులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీ

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 12 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన పోస్టర్‌ను రామగుండం అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సీపీ మాట్లాడుతూ గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకొంటుందని, దాని వల్ల తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. గంజాయి రహిత కమిషనరేట్ కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మేనేజ్‌మెంట్ హాస్పిటల్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు
- 18 ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వాహకులతో సమావేశం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 12 : ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.జీ.సుబ్బారాయుడు హెచ్చరించారు. ప్రైవేట్ దవాఖానల తీరుపై పత్రికల్లో వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో శుక్రవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో 18 మేనేజ్‌మెంట్ ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు, వైద్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. అంబులెన్స్ డ్రైవర్లు, యజమానులు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఎందుకు నిర్వహిస్తున్నారని, మీకు.. మెడికల్‌కు ఏం సంబంధమని ప్రశ్నిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. నాన్ మెడికల్ ఫీల్డ్ వారు హాస్పిటల్స్ నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దవాఖానల్లో క్వాలిఫైడ్ వైద్యుడు, ట్రైయిన్డ్ సిబ్బంది, స్పెషలిస్టులతో పాటు స్పెషలైజేషన్ బోర్డులు, ధరల పట్టికలు ఉండాలని, డాక్టర్ హాస్పిటల్‌లో లేకపోతే అందుబాటులో లేరని బోర్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక నుంచి ప్రతి మూడు నెలలకోసారి తనిఖీలు నిర్వహిస్తామని, ఏదైనా ప్రైవేట్ దవాఖాన మీద ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య పరీక్షల పేరిట రోగులను ఇబ్బందులకు గురిచేయవద్దని, ఫీజులు కూడా తక్కువ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెమో బూక్య వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొన్నారు.

సీనియర్లకు గౌరవమివ్వరా..?

మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేల సమక్షంలో కౌన్సిలర్, మైనార్టీ నేత ఆగ్రహం

ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతుండగానే మంత్రిని సన్మానించేందుకు పోటీపడుతున్న నాయకులు, కార్యకర్తలు

బెల్లంపల్లి/రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 : పార్టీకి అంకితమై ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తున్న సీనియర్లకు గౌరవమివ్వడం లేదని మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండి ప్రభాకర్ యాదవ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ సమక్షంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కన్నాల శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, మధ్యాహ్నం ఒంటిగంటకు మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇతర మండలాల నాయకులకు సమావేశంలో మాట్లాడడానికి అవకాశం ఇస్తున్నారు, స్థానిక నాయకుడినైన తనకు మాత్రం పట్టించుకోవడం లేదని మంత్రికి తెలియజేశాడు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం నెలకొంది. మంత్రి జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో ప్రభాకర్ శాంతించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతుండగా నాయకులు, కార్యకర్తలు మంత్రిని సన్మానించేందుకు పోటీ పడ్డారు. తాను చెప్పేది ఎవరూ కూడా వినడం లేదంటూ ఆయన అసహనానికి గురయ్యారు. ఇక రామకృష్ణాపూర్ లోని శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమం లో సాక్షాత్తూ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎదుటే లుకలుకలు బయట పడ్డాయి. రామకృష్ణాపూర్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అప్జల్ (లాడెన్) మాట్లాడుతూ పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న తనకు ఆదరణ కరువైందని అదే వేదిక పక్కన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చుట్టూ చేరి భజన చేసే వాళ్లకి మాత్రమే కాదు.. పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు కూడా గౌరవమివ్వాలని కోరారు. దీంతో అక్కడున్న మిగతా నాయకులు ఆయనతో వాగ్వాదానికి దిగారు.

బోర్‌వెల్ నుంచి నీళ్లు తీసుకొస్తున్న లేండిగూడ ప్రజలు

గుట్ట దిగితేనే గొంతు తడిచేది..

- లేండిగూడలో తాగు నీటి తిప్పలు
- మిషన్ భగీరథ ద్వారా కొన్ని పాంతాలకే సరఫరా
- గుక్కెడు నీటి కోసం బావి, బోర్ల వద్దకు పరుగులు
- పక్కా ఇళ్ల నిర్మాణానికీ ఇబ్బందులు
- అధికారులు స్పందించాలని గ్రామస్తుల వేడుకోలు

కెరమెరి, ఏప్రిల్ 12 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన లేండిగూడలో తాగు నీటికి తిప్పలు పడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పథకం ద్వారా వారంలో మూడు సార్లు.. అదీ కూడా కొన్ని ప్రాంతాలకే నీరు సరఫరా చేస్తుండగా, గ్రామస్తులు గొంతు తడుపుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. ఈ గ్రామం గుట్టపై ఉంటుంది. ఇక్కడున్న బోరు కూడా ఎండిపోగా, గుక్కెడు నీటి కోసం గుట్ట కిందున్న బావి, బోరు వద్దకు చేరుకొని నీరు తోడుకుంటున్నారు. నీటి బిందెలతో గుట్టపైకి ఎక్కడం నరకప్రాయంగా మారింది. పనులన్నీ వదులుకొని నీళ్లకోసమే సమయమంతా కేటాయించాల్సిన దుస్థితి నెలకొంది. పశువుల దాహార్తిని తీర్చేందుకూ అవస్థలు పడాల్సి వస్తున్నది. అలాగే నీటి కొరత కారణంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలు నిర్మించుకోలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిత్యం తాగు నీరు సరఫరా చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

బిందెలతో గుట్టెక్కలేకపోతున్నం

మా ఊరు గుట్టమీద ఉంటుంది. ఇప్పటిదాకా మిషన్ భగీరథ ద్వారా మంచిగనే నీళ్లిచ్చిర్రు. కొన్ని రోజుల సంది వస్తలేవు. ఉన్న ఒక్క బోరు కూడా ఎండిపోయింది. తాగు నీటికి మస్తు తిప్పలైతంది. ప్రతి రోజూ గుట్ట కిందికి పోయి నీళ్లు తెచ్చుకుంటున్నం. బిందెలు ఎత్తుకొని గుట్ట ఎక్కాలంటే ఆయాసం వస్తున్నది. ముసల్దాన్ని అయితి. ఆరోగ్యం సహకరించకున్నా గోలీలు వేసుకొని నీళ్లు తెచ్చుకుంటున్న. ఇకనైనా అధికారులు మా గోస తీర్చాలే.

- తొర్రె విఠాబాయి, వృద్ధురాలు, లేండిగూడ

మస్తు కష్టమైతంది

మిషన్ భగీరథ నీళ్లిస్తలేరు. తాగు నీళ్లకోసం బావుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. బిందెలతో గుట్ట ఎక్కడం మస్తు కష్టమైతంది. తెల్లవారుజామున లేచి నీళ్లకోసం ఉరుకుతున్నం. నీళ్లెత్తుకొని గుట్టెక్కుతుంటే కాళ్లు గుంజుతున్నయి. పశువులకు కూడా తాగు నీళ్లకు తిప్పలైతంది. ఇండ్లు కట్టుకుందామంటే నీళ్లు లేకపాయే. ఇకనైనా మా బాధ పట్టించుకోవాలే.

- సూర్యవంశి హరబాయి, లేండిగూడ

పరిహారం తీసుకొని.. ప్రకృతివనం నరికేసి..

- అధికారంలో ఉన్నాం.. తమదే నడుస్తదంటూ ఏపీవోకు వార్నింగ్!
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

బృహత్ పకృతి వనంలో నరికివేసిన చెట్లు

హాజీపూర్, ఏప్రిల్ 12 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెకూ పల్లె ప్రకృతి వనంతో పాటు 10 ఎకరాల్లో బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ పాలనలో వాటికి రక్షణ కరువైంది. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండపల్లి గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన బృహత్ ప్రకృతి వనంలోని చెట్లను కొందరు శుక్రవారం నరికివేశారు. 2007లో ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో భూసేకరణ కింద అప్పటి ప్రభుత్వం ఈ బృహత్ పకృతి వనానికి సంబంధించిన ఆరు ఎకరాలను సేకరించింది. ఎకరానికి రూ.1 82 లక్షల చొప్పున పరిహారం సైతం చెల్లించింది. 2021లో మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకం కింద దాదాపు రూ. 9 లక్షలను ఖర్చు చేసి 35 వేల పూలు, పండ్లు, తదితర మొక్కలతో బృహత్ ప్రకృతి వనాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మొక్కలను సంరక్షిస్తూ వస్తున్నారు. కానీ పరిహారం తీసుకున్న వ్యక్తులే శుక్రవారం మా భూమిలో కావాలనే మొక్కలు నాటారంటూ వాటిని కొట్టేస్తున్నట్లు అధికారులకు సమాచారం వెళ్లింది. వెంటనే స్పందించిన అధికారులు.. ఏపీవో మల్లయ్యను ఘటనా స్థలానికి పంపించారు. ఈ మేరకు అక్కడికి వెళ్లిన ఆయనతో గతంలో ఆరు ఎకరాలకు పరిహారం తీసుకున్న వ్యక్తులు వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. అప్పటి బీఆర్ఎస్ సర్పంచ్, ఎంపీపీ, మాజీ ఉపసర్పంచ్ కావాలని ముంపులో పోయిన తమ భూమిలో మొక్కలను నాటించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రస్తుతం తాము(కాంగ్రెస్) అధికారంలో ఉన్నామని, తమదే నడుస్తుందంటూ ఏపీవోకు వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకొని అక్కడికి కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులతో నూ సదరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. ఎంత కాంగ్రెస్ నాయకులైతే మాత్రం పరిహారం తీసుకున్న భూమిలో ప్రభుత్వం నాటిని నాటిన చెట్లను నరికి వేయడం, పైగా అధికారులనే దబాయించడం ఏమిటని ప్రకృతి ప్రేమికులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో మధుసూదన్‌ను వివరణ కోరగా పకృతివనంలో చెట్లను నరికేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

రేషన్ షాపు నుంచి బియ్యం మాయం

- రాత్రి వేళలో ఆటోలో తరలిస్తున్న వీడియో వైరల్
- చిత్రీకరించిన యువకులతో గొడవకు దిగిన కౌన్సిలర్ కుటుంబ సభ్యులు
- ఇంటి పనులకు మున్సిపల్ సిబ్బందిని వాడుకున్న లీడర్
- జిల్లా కేంద్రంలో చర్చనీయాంశం

రేషన్ షాపు నుంచి బియ్యం ఆటోలో వేసుకొని తీసుకెళ్తున్న డ్రైవర్

కౌన్సిలర్ కారు తుడుస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాల, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో రేషన్ దందా రోజురోజుకూ పెరిగిపోతున్నది. నేరుగా రేషన్ షాపు నిర్వాహకులే అక్రమార్కులకు బియ్యాన్ని అప్పగిస్తున్నారనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చింతపండువాడకు చెందిన రేషన్ దుకాణం నంబర్-3211018 నుంచి రాత్రి వేళ ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలించుకుపోతున్న వీడియో శుక్రవారం వాట్సప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది. రేషన్ షాపు నుంచి బియ్యం తెచ్చి ఆటోలో వేస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. కాగా, ఈ వీడియో తీసిన స్థానిక యువకులతో మంచిర్యాల మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ రామగిరి బానేశ్ కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి పెద్ద గొడవకు దారితీసింది. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించేశారు.

ఇంటి పనులకు మున్సిపల్ సిబ్బంది

ఇదే కౌన్సిలర్ బానేశ్ ఇంటి పనుల కోసం మంచిర్యాల మున్సిపల్ సిబ్బందిని వాడుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మున్సిపాలిటీ నుంచి జీతం తీసుకునే సిబ్బందిని కౌన్సిలర్ సొంత పనులకు వాడుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది ఒకరు కౌన్సిలర్ బానేశ్ కారు తుడుస్తున్న వీడియో సైతం బయటికి వచ్చింది. ఈ రెండు విషయాలపై సదరు కౌన్సిలర్‌ను వివరణ కోరగా.. రేషన్ షాపునకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నడుమునొప్పి కారణంగా మున్సిపల్ సిబ్బందిని ఇంట్లో వాటర్ క్యాన్ మోసేందుకు వాడుకున్నానన్నారు. అర్జెంట్‌గా ఓ ఫంక్షన్‌కు వెళ్లేహడావుడిలో ఒకసారి కారును కూడా తుడిపించినట్లు చెప్పారు. తనపై కావాలనే కొందరు స్థానికులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు.